క్లుప్తంగా

వృద్ధులకు సన్మానం



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన వయోవృద్ధులు రాళ్లచర్ల జగన్నాథం, దేవర రాములు, పానుగపాటి పెద వెంకటేశ్వర్లు, బత్తుల వెంకటేశ్వర్లు, సూరంశెట్టి రామచంద్రరావు, మీనుగు కృష్ణ, ముక్కెర నరసింహారెడ్డి, పి. రాధ, కె. కిట్టమ్మలకు నూతన వస్త్రాలు బహూకరించారు. రిటైర్డు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, సాయిబాబా సేవా కమిటీ అధ్యక్షుడు ఊటుకూరు నారాయణరావు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

జి.కొండూరు: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని ఎస్ఐ సతీష్‌కుమార్ అన్నారు. చెవుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై జి.కొండూరు పోలీసులు అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. విద్యార్థి దశలో కేసులు నమోదైతే భవిష్యత్‌పై ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు గౌతమ్, గౌరీశ్వరి, హెచ్ఎం కేఎస్‌జే లక్ష్మి పాల్గొన్నారు.

జ్యేష్ఠ రమేష్‌బాబుకు పరామర్శ



జి.కొండూరు: మైలవరం మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు తల్లి విమలాదేవి (92) అనారోగ్యంతో ఈ నెల 13న మృతిచెందారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు గురువారం కుంటముక్కల గ్రామంలోని జ్యేష్ఠ రమేష్‌బాబు నివాసానికి వెళ్లి విమలాదేవి చిత్రపటానికి నివాళులర్పించారు. రమేష్‌బాబు, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

జి.కొండూరు: కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ సాధన కోసం ఈ నెల 25న విజయవాడలో జరుగనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని 2003వ సంవత్సరం డీఎస్సీ ఉపాధ్యాయులు కోరారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద మహా ధర్నా వాల్ పోస్టర్లను ఉపాధ్యాయులు గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో డెమొక్రటిక్ పీఆర్టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, జిల్లా నాయకులు రామారావు, కిశోర్, కిరణ్, శ్రీరామ్, రంజిత్, మాధవరావు పాల్గొన్నారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్

మైలవరం: అమరావతిని రానున్న తరాల డీప్–టెక్ పరిష్కారాల కేంద్రంగా రూపొందించాలన్న దిశగా ముందడుగు పడుతోందని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్–2025 కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమ లక్ష్యం, క్వాంటమ్ సాంకేతికత ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది కొరతతో అవస్థలు

చాట్రాయి: సచివాలయ సిబ్బంది కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 16 సచివాలయాల్లో 16 మంది డిజిటల్ అసిస్టెంట్లకుగాను ఇటీవల 8 మంది బదిలీ అయ్యారు. కొత్తగూడెం, తుమ్మగూడెం, పోతనపల్లి, నరసింహారావుపాలెం, చాట్రాయి, కోటపాడు, బూరుగుగూడెం, మర్లపాలెం గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు లేకపోవడంతో కుల ధ్రువీకరణ పత్రాలు, 1బి, అడంగళ్, పాసుబుక్‌లు, ఆధార్ అప్‌డేట్లు లాంటి పనులు కాకపోవడంతో విద్యార్థులు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. బదిలీలు అయి నెలలు గడిచినా నేటి వరకు నియామకాలు చేపట్టకపోవడంతో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

చాట్రాయి: కృష్ణారావుపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం దాడి చేశారు. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని రెండు ద్విచక్ర వాహనాలు, రూ. 17,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

వారం రోజులుగా ముంపులోనే!

- వెయ్యి ఎకరాల్లో పంటల మునక
- పంటలు దెబ్బతింటున్నాయని రైతుల ఆందోళన
- పొంచి ఉన్న తెగుళ్ల భయం
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అధికారుల సూచనలు



గుంటుపల్లిలో వారం రోజులుగా నీటి ముంపులోనే ఉన్న వరి పైరు



చిలుకూరులో ఏనుగుగడ్డ వాగు ముంపునకు గురైన పత్తి చేను

ఇబ్రహీంపట్నం: ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదల ప్రభావంతో వరి, పత్తి, మినుము, మునగ వంటి పంటలు నీటి ముంపునకు గురయ్యాయి. అధిక వర్షాలు ఆగిపోయినా కృష్ణానది వరద ఇంకా కొనసాగుతోంది. వరద తాకిడికి గురైన వరి, పత్తి తదితర పంటల్లో తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. రైతులు తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టి నీటి ముంపునకు గురైన పంటలను కాపాడుకోవాలని సూచిస్తున్నారు. మండలంలోని కొటికలపూడి, జూపూడి, చిలుకూరు, మూలపాడు, కిలేశపురం, త్రిలోచనాపురం ఇబ్రహీంపట్నం, ఈలప్రోలు తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా పంటలు వరద బారిన పడ్డాయి. వీటిలో సుమారు 500 ఎకరాల వరకు వరి పైరు ఉంటుందని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

వడబడిపోయిన మొక్కలు..

ఈనెల 13న అధిక వర్షాలతో పొంగిన ఏనుగు గడ్డ వాగు, కొండవాగు, ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు నుంచి వెలువడిన నీటి ప్రవాహంతో జూపూడి, ఇబ్రహీంపట్నం, కిలేశపురం, గుంటుపల్లి, ఈలప్రోలు గ్రామాల్లో వరి పైర్లు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ నీటిలోనే వరి పైర్లు ఉన్నాయి. కొన్ని పొలాల్లో మొక్కలు వడబడి పోయాయి. నీటిలో పైర్లు ఉండటం వలన అవి పచ్చదనం సంతరించుకునే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. మరలా దమ్ముచేసి నాట్లు వేసుకునేందుకు కొందరు రైతులు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టామని, ప్రభుత్వం కనీసం నష్టం అంచనాలు వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపులో ఉన్న పంటల రక్షణకు వ్యవసాయాధికారులు పలు సూచనలు చేశారు.

రక్షణ చర్యలు ఇవి..

నీట మునిగిన పొలాలు త్వరగా పుంజుకోవడానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పై పాటుగా వేయాలి. తరువాత లీటరు నీటికి రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ నీటితో కలిపి పిచికారీ చేయాలి. పిలకలు కట్టే దశలో నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయడం వలన పంట త్వరగా పుంజుకుంటుంది. నష్ట నివారణ చాలా వరకు తగ్గుతుంది. వరద వాతావరణంలో ఆశించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. మందుల పిచికారీకి డ్రోన్‌లను ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసే అవకాశం ఉంటుంది.

పత్తి పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు

పత్తి పంటలో నిలబడి ఉన్న అదనపు నీటిని తక్షణం తీసివేయాలి. ఎండ ఉన్న సమయంలో పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 ఎరువును వారం వ్యవధిలో ఆకులపై రెండుసార్లు పిచికారీ చేయాలి. అనుకూల పరిస్థితులు పునరుద్ధరించబడిన అనంతరం పూత, పిందె దశలో ఎకరాకు 20 కిలోల యూరియా, 15–20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను బూస్టర్ మోతాదులో పైపాటుగా వేయాలి. ముందు జాగ్రత్త చర్యగా 90 రోజుల పంటలో కాయ తెగులును నివారించేందుకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 600 గ్రాములు ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. 45 రోజుల వయస్సు ఉన్న పంటకు ఆకుల మీద వచ్చే మచ్చ తెగుళ్లను నివారించేందుకు కార్బెండిజమ్, మాంకోజెబ్ మిశ్రమం 2.5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించండి



వరద నీటికి గురైన పంట పొలాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు రైతులు పాటించాలి. వారి సూచనల ద్వారా పంట త్వరగా కోలుకునే అవకాశం ఉంది. పత్తిలో ఎక్కువ రోజులు నీరు నిలిచి ఉండకూడదు. తక్షణం బయటకు పంపి సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలి.

– వై.రజని, వ్యవసాయాధికారి, ఇబ్రహీంపట్నం

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

మైలవరం: వినాయక చవితిని పురస్కరించుకుని మండపాలు ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని మైలవరం ఎస్ఐ సుధాకర్ పేర్కొన్నారు. మండపాల ఏర్పాటుకు ఈనెల 23వ తేదీ సాయంత్రం 8 గంటలలోగా తప్పని సరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వాహకులు ముందుగానే కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, మైక్ పర్మిషన్ కోసం సంబంధిత డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమేరాలు అమర్చాలని, పబ్లిక్ ప్రదేశాలలో మండపం ఏర్పాటు చేయాలనుకునే వారు పంచాయతీ, మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకోవాలని, విగ్రహాల ఎత్తు 5 అడుగులకు మించరాదని, రాత్రి 10 గంటల తరువాత ఎలాంటి కార్యక్రమాలు జరపవద్దని చెప్పారు. ఇతర వివరాలకు పోలీసు వారిని సంప్రదించాలని కోరారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చిన్నారులకు అవగాహన

ముసునూరు: సమాజంలో జరుగుతున్న అకృత్యాలు, లైంగికదాడులు, అనర్థాలకు చరమగీతం పాడాలంటే ముందుగా చిన్నారులంతా చైతన్యవంతం కావాలని, నూజివీడు డివిజన్ శక్తి టీమ్ సభ్యులు, ముసునూరు ఏఎస్ఐ నాగఫణి భూషణరావు సూచించారు. కాట్రేనిపాడు ప్రాథమిక పాఠశాలలో గురువారం చిన్నారులపై అకృత్యాలు, లైంగికదాడులు, అనర్థాలపై, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ అపరిచితుల మోసపూరిత మాటలను నమ్మవద్దని, వారు ఇచ్చే తినుబండారాలు తినవద్దని, వారి బైక్‌లపై వెళ్లవద్దని సూచించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీస్ సంధ్యారాణి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, శక్తి టీమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న స్వామిదాసు, నాయకులు

తిరువూరు: ఎన్నికల్లో గెలుపు కోసం నోటికి వచ్చిన వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. స్థానిక 15వ వార్డులో గురువారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. స్వామిదాసు మాట్లాడుతూ లెక్కకు మిక్కిలి ఆంక్షలతో తల్లికి వందనం, స్త్రీశక్తి పథకాలను పట్టాలెక్కించిన కూటమి ప్రభుత్వం వాటి అమలులో నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీలలో ఆడబిడ్డ పథకం, నిరుద్యోగ భృతి ఏమయ్యాయో అర్థం కావడం లేదని చెప్పారు. ఏడాదిన్నర పాలనలో రాష్ట్రానికి వేలకోట్ల అప్పులు మిగిల్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల గోడు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్ల లబ్ధిదారులకు నిధుల మంజూరు గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి, నగర పంచాయతీ కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, ఏరువ ప్రకాష్‌రెడ్డి, గుంటూరు మస్తాన్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాలసాని గోపాల నాగేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు, నాయకులు వెలుగోటి ఆదినారాయణ, ఇనపనూరి రవి, తిరుమలశెట్టి వేణుబాబు, ఇనపనూరి రవి పాల్గొన్నారు.

2వ వార్డులో..

తిరువూరు రెండో వార్డులో కూడా గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైనందున ప్రతి ఒక్కరూ బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని క్యూ ఆర్ కోడ్ల స్కానింగ్ ద్వారా తమ అభిప్రాయాలు తెలియజేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు కోరారు. నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం టౌన్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జి.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరంలోని అయ్యప్ప నగర్, సిద్ధిపేట, బస్టాండ్ ఏరియా, రామకృష్ణ కాలనీ, ఎస్‌వీఎస్ నగర్, పొందుగల రోడ్డు, ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, పోస్టాఫీస్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, విజయవాడ రోడ్డు శివాజీ వీధి, బట్టీల ఏరియా, యాదవుల బజార్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలి

ముసునూరు: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును, విద్యుత్ చార్జీల పెంపును తక్షణం విరమించుకోవాలని సీపీఎం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముసునూరు, చింతలవల్లి గ్రామాల్లో సీపీఎం మండల నేతల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ఆంధ్రా ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

విస్సన్నపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్, కొండపర్వ బాలికల గురుకుల పాఠశాల, విస్సన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు గురువారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. విజయవాడ జూబ్లీ క్లబ్‌కు చెందిన యర్రంశెట్టి శ్రీనివాసరావు సౌజన్యంతో డీహెచ్ కంటి హాస్పటల్ వైద్యులు 1,100 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 68 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 25 మందిని విజయవాడ కంటి హాస్పటల్‌కు రిఫర్ చేశారు. ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్స్ జాన్ బాబు, వీర్ల కిరణ్, రామకృష్ణ, క్లబ్ అధ్యక్షులు అరుణకుమారి, కార్యదర్శి జగన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఆర్డీఓ కావూరి చైతన్య



అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీఓ చైతన్య

ఇబ్రహీంపట్నం: కృష్ణానదిలో వరద ఉధృతి ఉన్నందున వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తక్షణ చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్డీఓ కావూరి చైతన్య రెవెన్యూ అధికారులకు సూచించారు. కృష్ణానదికి పోటెత్తిన వరద ప్రవాహాన్ని స్థానిక పవిత్ర సంగమం వద్ద గురువారం ఆయన పరిశీలించారు. ఎగువ ప్రాంతం నుంచి 5.14 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నందున జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకు సూచించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సైతం అప్రమత్తంగా ఉండి ఘాట్ల వద్ద ఎవరినీ స్నానాలకు దిగనీయకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు వరదపై పర్యవేక్షణ జరపాలని చెప్పారు. అనంతరం ట్రక్ టెర్మినల్ వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. ముందస్తుగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో లంక గ్రామాల ప్రజలను తరలించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు.

ఆస్పత్రి స్వీపర్ అదృశ్యంపై ఆందోళన

జి.కొండూరు: జి.కొండూరు పీహెచ్‌సీలో స్వీపరుగా పనిచేస్తున్న మందా చిరంజీవి గురువారం ఉదయం అదృశ్యమైంది. జి.కొండూరుకు చెందిన మందా చిరంజీవి 30 ఏళ్లుగా స్థానిక పీహెచ్‌సీలో గౌరవ వేతనం తీసుకుంటూ స్వీపరుగా పనిచేస్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి విధులకు హాజరైన ఆమె గురువారం ఉదయం వేతనం విషయమై అప్పర్ డివిజన్ క్లర్క్‌తో మాట్లాడారు. అనంతరం భర్త మందా ఏసుదాసుకు ఫోన్ చేసి తన కోసం వెతకొద్దని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. చిరంజీవి భర్త ఏసుదాసు ఫిర్యాదు మేరకు జి.కొండూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల మండల కన్వీనర్ల నియామకం

నూజివీడు: వైఎస్సార్ సీపీ బూత్ కమిటీలకు సంబంధించి మండల కన్వీనర్లను నియమించామని నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ శీదర్ల శాంతకుమార్ గురువారం తెలిపారు. చాట్రాయి మండలానికి మిద్దే శివాజీ, ముసునూరు మండలానికి కంభాల దాసు, నూజివీడు మండలానికి రేపూరి మహేష్, ఆగిరిపల్లి మండలానికి దాసరి వెంకట రామారావు, నూజివీడు పట్టణానికి షేక్ మస్తాన్‌లను నియమించామని వివరించారు.

రిటైనింగ్ వాల్ పరిశీలన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాంతినగర్ వద్ద బుడమేరు రిటైనింగ్ వాల్‌ను కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు గురువారం పరిశీలించారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు వరద నీటి ప్రవాహంతో పాటు వాల్ పటిష్టతను గమనించారు. గత ఏడాది బుడమేరుకు వచ్చిన వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని రిటర్నింగ్ వాల్ పటిష్టంగా నిర్మాణం చేపట్టామని చైర్మన్ చెప్పారు. కౌన్సిలరు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల ఆందోళన




ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

నూజివీడు: అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి. రాజు డిమాండ్ చేశారు. నూజివీడులోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో తమ డిమాండ్ల సాధనలో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ పిల్లల మానసిక ఎదుగుదలకు నిలయంగా ఉండాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలను సమాచార సేకరణ కేంద్రాలుగా ప్రభుత్వం మార్చేసిందని ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ వర్కర్లకు కూటమి ప్రభుత్వ హయాంలో యాప్‌ల భారం బాగా పెరిగిపోయిందని, యాప్‌లను లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప జేయాలని, ముఖ ఆధారిత హాజరును తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ఆర్ హనుమాన్లు, అంగన్‌వాడీ వర్కర్ల సంఘం నాయకులు వి. ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- **ముసునూరు:** అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్ల సంఘం డిమాండ్ చేసింది. సీఐటీయూ మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి రాజకుమారి, సెక్టార్ నేతలతో కలిసి సమస్యలపై తహసీల్దార్ డి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు.

పింఛన్ల తొలగింపుపై దివ్యాంగుల నిరసన



ఏఓ అబ్దుల్ సలాంకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ఆగిరిపల్లి: దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి రాజులపాటి చంటి అన్నారు. దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంత మోసం చేస్తుందని అనుకోలేదని, నడవలేని స్థితిలో ఉన్న తమను ఇబ్బందులు పాలు చేయడం తగదన్నారు. అనంతరం ఏఓ అబ్దుల్ సలాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు, వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు యాకోబు, మండల కార్యదర్శి పిన్నిబోయిన రాంబాబు, వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల మహిళా అధ్యక్షురాలు గంపా వెంకటేశ్వరమ్మ, సునీల పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

తిరువూరు: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, తల్లికి వందనం నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ విద్యార్థులు గురువారం తిరువూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీఓ నెం.77 రద్దు చేయాలని, తల్లికి వందనం అందరికీ అమలు చేయాలని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్రప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నూరుశాతం విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని, విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపునకు తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారన్నారు. సంక్షేమ వసతి గృహాలు ప్రారంభించి మూడు నెలలైనా ఇంతవరకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు ఉదయ భాస్కర్‌కు అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సాయిపవన్, మోహన్, సోమేశ్ తదితరుపాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయండి

జి.కొండూరు: స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ రాఘవన్ అన్నారు. మండల పరిధి జి.కొండూరు, పినపాక గ్రామాలలో జరుగుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. రాఘవన్ మాట్లాడుతూ సర్వేలో భాగంగా ప్రతి రోజూ యాభై ఇళ్ల కొలతలను పూర్తి చేసి ఆన్‌లైన్ చేయాలని గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా పారిశుద్ధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేవీవీ నూతన కార్యవర్గాల ఎన్నిక

తిరువూరు: తిరువూరు, ఎ.కొండూరు మండలాలకు జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గాలను గురువారం ఎన్నుకున్నారు. జేవీవీ తిరువూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి. శీనయ్య, ఎం. సుధాకర్, ఎ.కొండూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి. వంశీ, ఎస్. రాంకుమార్, గౌరవాధ్యక్షులుగా శోభన్‌బాబు, ఉపాధ్యక్షులుగా జి. రమేష్, పి. లీల, కోశాధికారిగా బి. రమేష్, సహాయ కార్యదర్శులుగా ఎ. రవీంద్రకుమార్, మోహన్‌రావు, శామ్యూల్ ఎన్నికయ్యారు.

త్రిసభ్య కమిటీల బాధ్యతల స్వీకారం

విజయవాడరూరల్: గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ ప్రాథమిక కో–ఆపరేటివ్ సొసైటీలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. కొత్తూరు తాడేపల్లి త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ధూళిపాళ్ల రమేష్, సభ్యులుగా బడుగు ఏడుకొండలు, గన్నేపూడి జమలయ్య, పైడూరుపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా దాసన నాగవర్ధనరావు, సభ్యులుగా చప్పుడి వెంకటరావు, రాతల వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కె. తాడేపల్లిలో నిర్మించిన సొసైటీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎల్.పుండరీక వరద వర్మ, అక్కల గాంధీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవాలపై నేడు సమావేశం

తిరువూరు: గణపతి నవరాత్రి ఉత్సవాలపై తిరువూరు డివిజన్‌లోని అన్ని శాఖల సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహిస్తామని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొనాలన్నారు.